క్లుప్తంగా

చెరువులోకి మురుగునీరు.. స్థానికులకు దుర్వాసన


చెరువులోకి వస్తున్న మురుగునీరు

జ్యోతినగర్: చెరువులోకి మురుగునీరు రావడంతో స్థానికులకు దుర్వాసన వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. రాజీవ్ రహదారి పక్కన ఉన్న మురుగు నీటి కాలువలోని నీరు మల్కాపూర్ శ్రీనగర్ కాలనీ నుంచి మల్కాపూర్ మల్లపురాణి కుంటలో నేరుగా కలుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులోకి నేరుగా మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని, మురుగు నీటి కాలువను వెడల్పు చేసేందుకు ఎన్టీపీసీ రామగుండం సంస్థ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి మురుగు నీటి కాలువను వెడల్పు చేసి బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఎనిమిదో రోజుకు రిలే దీక్షలు


దీక్షలో కూర్చున్న పూర్వపు లబ్ధిదారులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను 2016లో ఎంపిక చేసిన లబ్ధిదారులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ మూడు గ్రామాలకు చెందిన పూర్వపు లబ్ధిదారులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నాటికి రిలే దీక్షలు ఎనిమిదో రోజుకు చేరాయి. దీక్షలో 2016లో ఎంపిక చేసిన లబ్ధిదారులు బైఠాయించారు.

బేగంపేటలో యూత్ జోడో బూత్ జోడో


యూత్ జోడో బూత్ జోడోలో నాయకులు

రామగిరి: మండలంలోని బేగంపేటలో కాంగ్రెస్ నాయకులు బుధవారం యూత్ జోడో బూత్ జోడో నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి బండ కిషోర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. యూత్ జోడో లో యువకులను బాగస్వామ్యులను చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కొప్పుల గణపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శివ, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కల్వల శంకర్, నాయకులు శ్రీదర్ల రమేష్, బొంతల సది, లింగాల రాయమల్లు, దయ్యాల సది, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ ఆవరణలో హోమం నిర్వహించి అనంతరం హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు పూజారి బ్రహ్మశ్రీ కుసుమ ప్రదీప్ కుమార్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

నేడు యోగానంద లక్ష్మీనరసింహుని రథోత్సవం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గుట్టవద్ద నేడు శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుట్టముందు రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ ఈవో సదయ్య, ధర్మకర్తలు, దేవాదాయ శాఖ ఉద్యోగులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జూలపల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు,జాతరకు వచ్చే రద్దీతో వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు.


మంథని లో నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్టమధు


నివాళి అర్పిస్తున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్పర్సన్


పెద్దపల్లిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, అన్ని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళి అర్పించారు. దేశ ఉప ప్రధానిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశానికి ఆయన చేసిన సేవలను నాయకులు, కార్యకర్తలు, వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్


జ్యోతినగర్‌ నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు


జూలపల్లిలో నాయకుల నివాళి

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌ను కరీంనగర్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణ ఉద్యమకారులకు ఎలాంటి గుర్తింపు లేదని, ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయించాలని కోరారు. జార్ఖండ్‌లో ఇస్తున్నట్లు పింఛన్, డబుల్ బెడ్ రూం, సంక్షేమ ఫలాల్లో 20 శాతం వాటా, స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తింపు కార్డుల జారీ చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు దబ్బుట చంద్రకళ, పార్లమెంట్ కన్వీనర్ బత్తుల శంకర్, మంథని మండల అధ్యక్షుడు గొగుల రాజిరెడ్డి, నాయకులు రౌతు సందీప్, తెలంగాణ సుధాకర్, జాడి జంపయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ నిరసనలు


ఓదెలలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


గోదావరిఖనిలో నాయకుల నిరసన

జూలపల్లి/ సుల్తానాబాద్/ కమాన్‌పూర్/ జ్యోతినగర్/ రామగుండం/ సుల్తానాబాద్‌రూరల్/ఫెర్టిలైజర్ సిటీ/యైటింక్లయిన్‌కాలనీ/పాలకుర్తి/ధర్మారం/ ఓదెల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపీ నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు పలుచోట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. బండి సంజయ్ అరెస్టుపై నిరసనలు, ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందన్న సమాచారంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నిరసన కార్యక్రమాల్లో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు ఉచితంగా స్వయం ఉపాధి కోర్సులు


సెంటర్ ప్రారంభిస్తున్న దీప్తి మహిళా సభ్యులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచితంగా స్వయం ఉపాధి కోర్సులను అందిస్తున్నట్లు దీప్తి మహిళా సమితి సభ్యురాళ్లు మమత లాడ్, ఊర్జా దేశాయ్, పద్మశ్రీ అన్నారు. బుధవారం మూడు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సులు ప్రారంభించి మాట్లాడారు. ప్రభావిత, పునరావాస గ్రామాలకు చెందిన యువతకు మూడు నెలల కంప్యూటర్ శిక్షణను నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారా సాధికారత కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, ట్యాలీ 9.0తో కలిపి మూడు నెలల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి సభ్యురాళ్లు, ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, సుహాసిని,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తారని తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి డి.మాధవి అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని గాంధీ పార్క్ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరచడానికి తొలిమెట్టు, ఉన్నత సౌకర్యాలు కల్పించడానికి మన ఊరు-మన బడి వంటి కార్యక్రమాలను చేపట్టి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం మేజిక్ హరి ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన చిన్నారులను ఆకర్షించింది. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎంమంథని మధునయ్య, కార్పొరేటర్ కల్వల శిరీష, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు విజయ్‌కుమార్, జక్కం శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టాఫీస్ సేవలు సద్వినియోగం చేసుకోండి

మంథని: బ్యాంకుల కంటే పోస్టాఫీసులు వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నాయని సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంథని పోస్టర్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజారుద్దీన్ అన్నారు.మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, వృద్ధులు, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీంలో భారీ మార్పులు జరిగాయని తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అజారుద్దీన్ కోరారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

మంథని: మంథని మండలం కాకర్లపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. మొదటి ప్రైజ్ రూ.10,116 నగదును సైలెంట్ కిల్లర్ జట్టు, రెండో బహుమతి రూ. 5016 లను రన్నర్ జట్టుకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మెండ రాజయ్య, తదితరులు ఉన్నారు.

బీసీల ధర్నా విజయవంతం

పెద్దపల్లి రూరల్: ఈనెల 3, 4తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన బీసీల ధర్నా విజయవంతమైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. పెద్దపల్లికి చేరుకున్న ఆయన జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి హన్మయ్యతో కలిసి మాట్లాడారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీలకు మంచిరోజులు రానున్నాయని తెలిపారు. చట్టసభలో 50శాతం రిజర్వేషన్లను సాధించే దిశగా ఉద్యమ నిర్మాణ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వింజమూరి సురేశ్, కనుకుంట్ల నాగరాజు, సతీశ్, బొద్దుల అరుణ, స్వరూప, మనోరమ, లక్ష్మి, నిర్మల, వెంకటేశ్, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కోల్‌సిటీ: సింగరేణి గని కార్మికుడు అమరుడు పుట్ట నారాయణ 45 వ వర్ధంతి సందర్భంగా సోదరుడు పుట్ట రాజన్న సమక్షంలో, పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుట్ట రాజన్న, కంది నాగరాజు, గుండారపు శ్రీనివాస్, కండె రవీందర్, ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేత

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను బుధవారం తారుతో పూడ్చివేశారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ గంట పద్మ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చివేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేము కనకయ్య, మెట్టు కిష్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టాటా మ్యాజిక్ వాహనం డ్రైవర్ ఆర్ల శ్రావణ్ కుటుంబానికి, టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ బస్టాండ్ అడ్డా సభ్యులు అండగా నిలిచారు. సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సూచనలతో స్పందించిన అసోసియేషన్ సభ్యులు, అసోసియేషన్ అధ్యక్షుడు మారపెల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో రూ.33 వేల నగదును విరాళాల రూపంలో సేకరించారు. బుధవారం బస్టాండ్ అడ్డా దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ తాటిపాముల లక్ష్మీనారాయణ, సదానందం, కనకయ్య, అశోక్, సిరిపురం శంకర్ పాల్గొన్నారు.

'బండి సంజయ్‌ను బేషరతుగా విడుదల చేయాలి'

గోదావరిఖని: పోలీసులు అరెస్ట్ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌ను బేషరతుగా విడుదల చేయాలని పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రతిష్ఠను దిగజారుస్తున్న కేసీఆర్ కుటుంబం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోమల మహేష్, సులువ లక్ష్మీనర్సయ్య, మాతంగి రేణుక, మామిడి రాజేష్, గోపగాని నవీన్ గౌడ్, అడ్డూరి రాజేశ్, ఐత పవన్, గుర్రం సురేష్, సతీష్, మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడిగా కుమారస్వామి

రామగిరి: ముత్తారం మండలంలోని హరిపురం అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడిగా చెనవేన కుమారస్వామి యాదవ్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు కాసు తిరుపతి యాదవ్, యూత్ అధ్యక్షుడు చెల్కల యుగేందర్ యాదవ్ తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో నూతన కమిటీని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా ఏగుర్ల కుమార్ యాదవ్, కోశాధికారిగా గోస్కుల రమేశ్ యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య యాదవ్, యూత్ అధ్యక్షుడిగా ఏగుర్ల రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ యాదవ్, కోశాధికారిగా కుమారస్వామి యాదవ్‌ను ఎన్నుకున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెరుక సంఘం అధ్యక్షుడిగా ఎల్లయ్య


ఎల్లయ్య

ఓదెల: పురగిరి క్షత్రియ పెరుక సంఘం ఓదెల గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోపతి ఎల్లయ్య బుధవారం రెండోసారి ఎన్నికయ్యారు.సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో అధ్యక్ష పదవి కోసం గోపతి ఎల్లయ్య, అప్పని తిరుపతి పోటీపడగా 363 ఓట్లతో ఎల్లయ్య అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎంపీటీసీ బొడకుంట చిన్నస్వామి, సంఘ సభ్యులు బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఎల్లయ్యను సన్మానించారు.

శ్రీపాదరావు కుటుంబాన్ని విమర్శించడం సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు, కుటుంబంపై జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు విమర్శలు చేయడం సరికాదని మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్ అన్నారు. బుదవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మహనీయుల చుట్టూ తిరిగినంత మాత్రాన జ్ఞానవంతులు కాలేరని, మహనీయులు ఎక్కడా ఇతరులను కించపర్చాలని చెప్పలేదన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి పేరవేన లింగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు మంథని రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



సెంటినరీకాలనీ, గోదావరిఖనిలో బండి సంజయ్ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని: ఎంపీ బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు పీటీస్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, తానిపర్తి గోపాల్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రూప్ వన్, ఎస్ఎస్‌సీ పరీక్ష పత్రాలు కావాలని లీక్ చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్‌నాం చేయాలని చూశారన్నారు. నాయకులు మూల విజయారెడ్డి. తోడేటి శంకర్‌గౌడ్, పర్లపల్లి రవి, నూతి తిరుపతి పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల అబ్బాస్, తోట హరీష్, జిట్టవేన వేణు, పిడుగు కుమార్, చింటు తదితరులు పాల్గొన్నారు.

మంథని: ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మలను బుధవారం మంథనిలో దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ కొండ శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: సెంటినరీకాలనీలోని తెలంగాణ చౌరస్తా వద్ద బుధవారం బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు.

ధర్మారం: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రాన్ని సంజయ్ అనుచరుడు లీకేజీ చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేసి అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, నాయకులు కూరపాటి శ్రీనివాస్, మిట్ట తిరుపతి, సుంచు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

ఎలిగేడు: ఎంపీ బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న రాయదండి గ్రామస్తులు

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం పాలకుర్తి మండల పరిధిలోని కొత్తపల్లి, పుట్నూర్, జయ్యారం, వేంనూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోల లత, మల్లెత్తుల శ్రీనివాస్, ఎంపీటీసీ గంగాధర రమేష్, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, నాయకులు పున్నం సాగర్, చింతకింది సత్యనారాయణ, బుట్టి శ్రీకాంత్, కాసర్ల కిరణ్, ఆశాలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతినగర్: మనసున్న ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ ప్రధానకార్యదర్శి బుర్ర శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం మేడిపల్లి సెంటర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు శంకర్, పోచం, చందు, గోపాల్, వంశీ, ఆనంద్, నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: ఇటీవల గోదావరిఖనిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు రాయదండి గ్రామ సర్పంచ్ ధర్మాజి కృష్ణ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

విగ్రహాలను పట్టించుకునే వారేరీ?

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ నుంచి ఏనుగులకండి గుట్టల మధ్య నుంచి పాలకుర్తి మండలం పుట్నూర్ వరకు రహదారి వేశారు. ఈ రహదారితో రెండు మండలాల మధ్య దూరభారం తగ్గింది. ఆరేళ్ల క్రితం గుట్టను మధ్యలో నుంచి చీల్చి రహదారి వేసే క్రమంలో చేపట్టిన బ్లాస్టింగ్స్‌తో ఎన్నో బండరాళ్లు ఎగిరి సమీపంలో పడగా ఆంజనేయుడు, వినాయకుడు, ఏనుగు ఆకారంలో చెక్కిన బండరాళ్లు వెలుగుచూశాయి. ప్రస్తుతం సదరు రాతి విగ్రహాలను శుద్ధి చేసి హనుమాన్ మాల ధారణ భక్తులు నిత్యపూజలు చేస్తూ తమ భక్తి శ్రద్ధలను చాటుకుంటున్నారు. స్వయంభూ వెలిసిన విగ్రహాలు కావడంతో వాహనదారులు దర్శనం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆడ, మగ ఉన్న రాతి విగ్రహాలలో గౌతమ బుద్ధుడు, శ్రీ వేంకటేశ్వరస్వామి, హోమం కాల్చిన దోని బయటపడ్డాయి. ఆ సమయంలో గ్రామస్తులు పురావస్తుశాఖ అధికారులకు సమాచారమిచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వదిలేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో పాటు కాకతీయ రాజులకు సంబంధించి పలు చారిత్రక ఆధారాలు కూడా ఉన్నప్పటికీ పురావస్తు అధికారులు పట్టించుకోకపోవడం ఇక్కడి ప్రజలను నిరుత్సాహానికి గురిచేస్తోంది.